


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కొంచెం పంచవయా....

**"తమకి ఎప్పుడూ ఏమీ కాని జనం కోసమే తపించినా....**
**సుఖాలు, స్వంతం, త్యజించీ మహాత్ములయి నిలిచారూ....**
**వీరంతా ఎవరయ్యా మనలాగే మనుషులయా**
**జాతికి వరములయా.. మన అందరి బంధువులయా.."**

అని మా చైతన్య ప్రసాద్ గారు గాంధీ, సోక్రటీస్, జీసస్‌ల గురించి ఉదహరిస్తూ ఓ పాట రాసారు. వెతికి - చూస్తే మన మధ్య కూడా ఇలాంటి అందరి బంధువులు చాలా మందే ఉంటారు.

కొంతమంది రహస్యాలని దాచుకోలేరు. నలుగురికీ పంచుతారు. కొన్ని ఛానెల్స్, వెబ్‌సైట్సూ, వదంతులని పంచుతాయి. కొంతమంది బాధ కలిగిన వెంటనే ఫోన్‌లు చేసి ఇంకో నలుగురికి తమ బాధలని పంచుతారు.

మా సుమిత్ర దగ్గర రేఖ అనే అసిస్టెంటు ఉంది. షూటింగులప్పుడు తనకూడా వెళుతుంటుంది. అందరూ నా వాళ్ళే అనుకుని డబడబా మాట్లాడుతుంటుంది. షూటింగుల దగ్గర చొరవగా 'టీ' మాస్టర్‌ని పక్కకి జరిపి 'టీ' చెయ్యడం, ఒక్కొక్కసారి అన్నం మిగిలితే పులిహోర కలిపి పంచెయ్యడం కూడా చేస్తుంటుంది. కాలుగాలిన పిల్లిలా ఒక చోట నిలబడకుండా చాలామంది ఇళ్ళకి వెళ్ళి, వాళ్ళ చేతిలో పని అందుకుని చేస్తుంది. వాళ్ళిచ్చిన డబ్బులు తెచ్చుకుంటూ దార్లో ఏ జామకాయలో, మొక్క జొన్న పొత్తులో కనిపిస్తే ఆగి అవి నిర్మలగారికి ఇష్టం, లేదా భువనగారికి ఇష్టం అని కొనుక్కొచ్చేస్తుంది. ఇంత కలవిడిగా, చొరవగా ఉంది కదా అని ఎవరైనా హేళన చేస్తే ఊరుకోదు. తను ఒక సర్వీస్ రిక్రూట్ ఏజెన్సీ కూడా స్వచ్ఛందంగా నడుపుతుంది. డ్రైవర్లనీ, చౌకీదార్లనీ, పనిమనుషులనీ శ్రీ నగర్ కాలనీ, జూబ్లీహిల్స్, మణికొండ ఏరియాలలో సప్లై చేస్తుంటుంది. అలా పనిలో చేరిన డ్రైవర్ ఎప్పుడైనా ఈమెకి లిఫ్ట్ ఇవ్వకపోయినా, ఏ పనిమనిషైనా కృతజ్ఞతగా ఉండకపోయినా, దాన్ని పీకించే పనిలో ఉంటుంది. మనిషి పాపం చాలా బోళా! వాళ్ళది తాడేపల్లి గూడెం, పొట్టకూటికి ఇక్కడ కొచ్చి పనిచేస్తోంది.

సుమిత్ర ఒకప్పుడు సీరియల్స్ ప్రొడ్యూస్ చేసినప్పుడు కొన్న కాస్ట్యూమ్స్ ఒక పెద్ద రేకు పెట్టెనిండా ఉన్నాయి, ఎవరికైనా పంచమని రేఖకి చాలా సార్లు చెప్పింది. "అలాగే" అని ఓసారీ, "పంచేసా" అని ఓసారీ చెప్పింది. తను నిజం అనుకుంది. కానీ అవన్నీ

మెట్లకింద వాచ్‌మెన్ ఇంట్లో దాచిపెట్టింది. మొన్న గూడెం వెళ్ళేటప్పుడు, ఈజీగా నేను పడుకోగలిగేటంత ఆ రేకు పెట్టె బయటకి తీయించింది. దాన్ని ఇద్దరు సాయం పట్టాలి.

"ఇదేవిటీ.. ఇవన్నీ పంచెయ్యమన్నానుగా!" అని సుమిత్ర అడిగితే,

"మా గూడెంలో ముష్టివాళ్ళకి పంచుతానండీ" అంది.

"ఇంత బరువు... అంతదూరం తీసుకెళ్ళడం అవసరమా? అనవసరంగా లగేజీ టికెట్ కోస్తాడు. ఇక్కడ రైల్వే స్టేషన్‌లో పంచెయ్యి" అంటే,

"అబ్బే! అలా ఒద్దండీ.. అక్కడ నాకు తెలిసున్న ముష్టివాళ్ళు ఉన్నారు.. నాకోసం ఎదురు చూస్తుంటారు.." అంది.

తెలిసున్న ముష్టివాళ్ళు అనగానే నాకు నవ్వొచ్చింది. మా పిల్లలు చిన్న తనంలో ఇంటిముందుకొచ్చి అడుక్కునే ముష్టివాళ్ళు ఎక్కడైనా కనపడితే, "ఈ ముష్టి అంకుల్ మా ఇంటికొస్తాడు.. నాకు తెలుసు! కదా ముష్టి అంకుల్.." అని తెగ సంబరపడేవారు. ఆ వయసులో ముష్టి ఎత్తడం ఒక ప్రొఫెషన్ అనే తప్ప ఇంకోటి తెలీదు. మా అక్క మనవడికి ఇప్పుడిప్పుడే మాటలొస్తున్నాయి. కర్ర కనిపిస్తే చాలు పట్టుకుని "అమ్మా... అన్నం వెయ్యి.." అని ఆడుతుంటాడు. పిల్లల్ని గమనిస్తే, వాళ్ళు ఎక్కువగా ఆడేది టీచర్ ఆటా, బస్ కండక్టర్ ఆటా, ముష్టి ఆటా.. ఈ మూడు ప్రొఫెషన్స్ వాళ్ళని ఆకర్షిస్తాయి.

ఇంక రేఖ విషయానికొస్తే, బయలుదేరుతుండగా సుమిత్ర అత్తగారు "ఎప్పుడొస్తావ్?" అని అడిగారు.

చాలా సీరియస్‌గా "వచ్చేస్తానండీ.. రామ్ చరణ్ పెళ్ళుందిగా!" అంది.

అందరూ అవాక్కయి "ఏ రామ్ చరణ్?" అన్నారు.

"అదేనండీ మన చిరంజీవిగారి అబ్బాయి" అంది.

"దానికీ నీకూ ఏం సంబంధం?" అడిగిందావిడ.

"నాగబాబు గారు మా పరిచయస్తుల ఇంటికొస్తారండీ, వాళ్ళని పిలుస్తారు కదండీ.. వాళ్ళతో ఎల్తానండీ!" అని కాన్ఫిడెంట్‌గా చెప్పింది.

ఆ పెట్టెని సాయం పట్టడానికి ఎవరినో బతిమాలి తెచ్చుకుంది. సుమిత్ర కార్లో పెట్టి డ్రైవింగ్ చేసుకుంటూ అమీర్ పేటలో బస్ ఎక్కించి, రివర్స్ చేసి కారు తీసేలోపే, గయ్యి గయ్యి మంటూ ఆ కండక్టరూ, రేఖ కిందకి దిగారు. కారణం ఏమిటని తెలుసుకుంటే, టికెట్ మీదున్న టైం చూసుకోలేదు. ఈ పెట్టె సాయం పట్టి పెట్టించే హడావిడిలో వీళ్ళు ఉండగా, పక్కన ఆలశ్యంగా వచ్చిన ఆ ముందు బస్సు వెళ్ళిపోయింది. రేఖ తక్కువది కాదు కాబట్టి 'అన్నయ్య' అంటూ ఆ కండక్టర్‌ని బతిమాలుకుని (ఈ పెట్టె సాయం పట్టి బస్సులో పెట్టినవాడు జంప్ అయిపోవడంతో) కండక్టరూ, డ్రైవరూ ఆ బస్సు వెనకాల ఈ బస్సుని ఛేజ్ చేసి ఆపించి, పెట్టె సాయం పట్టి ఆ బస్సులో చేర్చేటట్లుగా చేసుకుంది. ఆ పెట్టె సైజు చూసి పాపం లోపల ఏ నిధి నిక్షేపాలున్నాయో అనుకున్నారు వాళ్ళు. కానీ లోపల ఉన్నవి ముష్టిబట్టలు! ఈ రహస్యం మాకు మాత్రమే తెలుసు! కానీ పాపం రేఖకి గూడెం వెళ్ళినతరువాత న్యుమోనియా వచ్చిందట. మరి రామ్ చరణ్ పెళ్ళి వాయిదావేసుకోవాలేమో? ఈ విషయం నేను నవ్వుతూ అల్లు అరవింద్ గారితో చెప్పాను. ఆయన కూడా నవ్వి " మా వెస్ట్ గోదావరి వాళ్ళకి అందరినీ మన అనుకునే స్వభావం ఉంటుంది చూసారా" అన్నారు! మాది ఈస్ట్ గోదావరిలెండి అదీ బడాయి!

పంచాలనే ఆలోచన ఉండాలేకానీ ఎంతకష్టం అయినా పడొచ్చు! మా చిన్నాడికి కూడా చిన్నప్పటినుండీ ఈ పంచడం ఇష్టంగా ఉండేది. అవి ఇంట్లో నేను చేసిన చేగోడీలూ, రవ్వలడ్డూలూ అయితే ఏ బాధా ఉండేది కాదు! కానీ వాళ్ళ అన్నయ్య కామిక్స్, ఇంట్లో వేసుకున్న మొక్కలూ పంచేవాడు.

అశ్విన్ ఈ విషయంలో కృష్ణతో తీవ్రంగా ఘర్షణ పడేవాడు.

"నా పుస్తకం ఎవరికిచ్చావురా?"

"నా ఫ్రెండ్‌కి"

"ఎవడు వాడు? ఎక్కడుంటాడు?"

..నిశ్శబ్దం...

వాడి పేరేంటి?"

.....ఆలోచన...

"అదేంట్రా ఫ్రెండ్ అన్నావుగా.. పేరేవిటో తెలీదా?" అని నేను రంగప్రవేశం చేస్తే,

"ఏమో... మొన్న మేం గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతుంటే, తనూ వచ్చి ఆడాడు... ఇంటికి తీసుకొచ్చా... కామిక్స్ చూసి చదివిస్తా అన్నాడు. పేరు సందీపో.. సంతోషో - ఏదో ఉంది!" అనేవాడు.

"ఒరేయ్... ఈసారి ఇస్తే నీ వస్తువులు ఇచ్చుకో. అన్నవి ఇవ్వకు!" అనేదాన్ని. కానీ మళ్ళీ అశ్విన్ షటిల్ బ్యాటో, చెస్ బోర్డో, షరా మామూలే!

ఇద్దరూ పోట్లాడుకుంటుంటే మా అత్తగారు "ఒరేయ్ రామలక్ష్మణుల్లా ఉండాలిరా.. ఇలా పోట్లాడుకో కూడదు" అంటే, మా పెద్దాడు "ఆ.. వీడు లక్ష్మణుడైతే, అన్నా... వదిన్ని మా ఫ్రెండ్‌కి ఇచ్చేసా..." అంటాడు.

"ఎవ్రా? ఎక్కడుంటాడు?"

అంటే " ఏమో.. లంకో.... ఏదో... మళ్ళీ ఇచ్చేస్తాడులే.. చాలా మంచోడు.. అంటాడు" అనేవాడు ఉక్రోషంగా.

మేం అందరం బాగా నవ్వుకునేవాళ్ళం.

అసలు పంచుకోవడం అనేది మా వంశంలోనే ఉన్న 'ఖాన్‌దానీ బీమారి' అన్నమాట!

మా తాతగారు ఇంట్లో ఉన్నవి సమస్తం పంచేసేవాళ్ళుట. కాంగ్రెసు మూమెంట్లో పొలం, పుట్రా, నగా నట్రా అన్నీ పంచేసాకా హాయిగా ఉన్నారు. మా అమ్మమ్మగారు ఖద్దరు చీరలో, రవ్వంత బంగారం అయినా ఒంటి మీద లేకుండా ఉండేవారు! చాగల్లులో హరిజన ఆశ్రమం పెడితే ఈవిడ కంటె ఇవ్వాలి. ఎక్కడో తిరుపతిలో బీదవాడికి పోలీస్ స్టేషన్‌లో అన్యాయం జరిగితే, మా తాతగారింట్లో వెండి కంచం అమ్మాలి.. ఇలా ఆస్తినీ, ఉన్న నాలుగు సొమ్ముల్ని హారతి కర్పూరం చేయడంలో ఘనత వహించారు ఆ పెద్దాయన. ఆయన ధర్మపత్ని మా అమ్మమ్మ మాత్రం ఏం తక్కువ తిందా?

దీపావళి నాడు టపాకాయలు కొంటే, అన్నింట్లో నుండీ తలా నాలుగు పెట్టెలూ తీసి ఓ సంచిలో వేసి "పంతులు పిల్లలకి.. పాపం.. వాళ్ళమ్మ కొనలేదే! సీతమ్మకి ఇచ్చి వస్తా!" అనేది.

బియ్యం, కూరలు, బొబ్బర్లు, బట్టలు ఇలా అన్నీ ఈవిడ బరువైన సంచీలు మోసుకుంటూ వెళ్ళి రెండు మూడు కుటుంబాలని పోషించేది. అలా ఇవ్వడానికి మా దగ్గర ఉండికాదు! నెల ఆఖరివారం అంతా బియ్యం లేకపోతే గోధుమ అన్నం, బియ్యం నూకలూ మాకు వండిపెట్టేది.

మనకి కలిగిన దాంట్లో నలుగురికీ పంచిపెట్టాలి. అన్న సిద్ధాంతం మీదే ఆవిడ బ్రతికింది. మా టెక్స్ట్ పుస్తకాలు జాగ్రత్తగా ఉంచుకోమనేది. మా వెనకాల చదువుకునే పేదపిల్లలకి ఇవ్వడానికి. హైదరాబాదు వచ్చి చాలా దూరపు చుట్టాలు కూడా మా 'మహల్' లాంటి 'వీణమ్మ ఇల్లు' అని పేరు బడ్డ సింగిల్ రూం ఇంట్లో నెలలు తరబడి ఉండి, ఉద్యోగాలు సంపాదించుకుని వెళ్ళేవాళ్ళు! అలా

వెళ్ళి పెద్ద ఉద్యోగాలు సంపాదించుకున్న వాళ్ళు ఎవరూ మళ్ళీ ఈవిడ దగ్గర కొచ్చిన గుర్తు లేదు! కానీ ఆవిడ ఏనాడూ పట్టించుకోలేదు. ***పంచుతూ పోతున్నప్పుడు పెంచుకుంటే పోయే ఆత్మ సంతృప్తికి ఏదీ సాటి రాదుగా!***

చాలా రోజులకి సూరంపూడి వెంకట రమణమ్మ అనే మా అమ్మమ్మ లాంటి స్త్రీని నేను ఈమధ్య చూసాను.

కాంతిని విస్తరించడం..''స్ప్రెడ్డింగ్ లైట్'' అనే ఆర్గనైజేషన్ని డా.వింజమూరి సూర్యప్రకాశ్ అనే డాక్టర్ ప్రారంభించారు. ఆయన పేరుకీ ఆ ఆర్గనైజేషన్ పేరుకీ చాలా దగ్గర సంబంధం ఉంది. ఆయన శ్రీమతి డా.కామేశ్వరిగారు గైనకాలజిస్ట్. ఆవిడని చూస్తే ఒకప్పటి మా అమ్మమ్మని చూసిన ఫీలింగ్ కలిగింది.

రాత్రి పగలూ ఆ ఇల్లాలు స్టెత్ స్కోప్ పట్టి స్లమ్స్‌లో తిరుగుతూ బీద స్త్రీలకి వైద్యం చేస్తుంటారు.

''వైద్యం చేస్తే డబ్బులిస్తారని హైదరాబాదు వచ్చాకే తెలిసింది. మొదటిసారి ఎవరో ఇస్తే చాలా ఆశ్చర్యం వేసింది'' అన్నారావిడ.

కళకళలాడే మొహం. ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే డా.కామేశ్వరిగారిని చూడగానే అసలు జబ్బునుండి చాలా రిలీఫ్ వస్తుంది ఎవరికైనా. ''ఒక ఆడపిల్ల బాధపడుతూ తన రోగం గురించి నాతో చెప్పాకా, ఇంక అది తగ్గి ఆ అమ్మాయి హాయిగా ఉండేవరకూ నాకు మనసు బావుండదమ్మా'' అన్న ఆవిడ మాటలు ఎంతైనా నిజం అని నా స్వీయ అనుభవంతో తెలుసుకున్నాను! Organ Removal అనేది ఖండిస్తూ ఆవిడ ఉద్యమం చేస్తున్నారు. పెళ్ళికాని యువతులకి సైతం కొందరు గర్భసంచీ తీసెయ్యడం, ప్రోబ్లెం డయాగ్నైజ్ చెయ్యకుండానే సులభంగా గర్భాశయాన్ని తొలగించడం నిరశిస్తూ ఆ భార్యాభర్తలు వైద్యం చేస్తున్నారు. ***వాళ్ళకి ఓపెన్ హౌస్ అని హైదరాబాదు కొత్తపేటలో ఉంది. రోజుకి వందమంది వెళ్ళి ఉచితంగా భోంచెయ్యొచ్చు. వండుకుని కూడా తినొచ్చు. అంతేగాకుండా వందమంది శ్రామికుల కుటుంబాలని రుణవిముక్తులని చేస్తారు.***

***ఆ వంద కుటుంబాలు అయిపోయి, వాళ్ళు తీసుకున్న బ్యాంక్ లోన్లూ అవీ క్లియర్ అయిపోయాక ఇంకో వందమంది కుటుంబాలు వృత్తివిద్యలు నేర్చుకునేవాళ్ళకి, రుణాలు తీర్చుకుంటూ పోతున్నారు. ఎటువంటి హంగూ, ఆర్భాటం కానీ, పబ్లిసిటీ కానీ ఉండవు!*** నాకు వీళ్ళు ఎలా పరిచయం అంటే, నేనూ మా సుమిత్రా, ఇంకా కొందరు మిత్రులూ 'స్పైసీ బైట్స్'(Spicy Bites) లేదా 'రస్ ఫోడీ(Rasphody) అనే రెస్టారెంట్‌లో తరచూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటాం. ఆ రెస్టారెంట్ ఓనర్ గాయిత్రి కూడా మాకు బాగా ఫ్రెండ్ అయింది. చాట్స్ పెట్టే కౌంటర్ ఒకనాడు ఖాళీగా ఉండడమే కాకుండా అక్కడ డిస్‌ప్లేలో .. 100 Writers.. 100 Books అని కనపడింది. ఎవరో ఒకావిడ మైకు పట్టుకుని మాట్లాడుతూంటే, మిగతా నలుగురు ఐదుగురు నిశబ్దంగా కూర్చుని వింటున్నారు. అందులో ఒకావిడని రచయిత్రి బొమ్మదేవర నాగకుమారిగా నేను గుర్తించి లోపలికి వెళ్ళాను.

'చిరిగిన చొక్కా అయినా వేసుకో.. ఒక మంచి పుస్తకం కొనుక్కో' అన్న సూక్తికి నిర్వచనంలా డా.సూర్యప్రకాష్ గారు, నలిగిన లాల్చీలో ఉన్నా సాహితీ సుగంధాలు విరాజిల్లుతూ ఉంటారు; ప్రజల్లో పఠానాసక్తి పెంచడానికి నడుంకట్టారు. రోజూ ఒక రైటర్, ఒకమంచి పుస్తకాన్ని పరిచయం చేసి, డొనేట్ చెయ్యాలి. రద్దీగా ఉండే శ్రీ నగర్ కాలనీలో ఈ కార్యక్రమం నిశబ్దంగా జరిగి పోతోంది. నేనూ 'లీడర్' పుస్తకాన్ని పరిచయం చేసాను.

గాంధీజీ, భగత్ సింగ్, సుభాష్ చంద్ర బోసూ తెలిసిన మన పిల్లలకి మన తెలుగువారిలో ఎంతమంది స్వాతంత్రోద్యమంలో సమిధలుగా మారారో, ఎవరి త్యాగఫలం స్వాతంత్రం పేరుతో మనం ఈనాడు అనుభవిస్తున్నామో తెలీదు! అందులో ఒకరైన సూరంపూడి శ్రీహరిరావు అనే మా తాతగారి గురించి రాయడం, మాట్లాడడం నాకు ఎంతైనా సంతోషం కదా!

నేను లీడర్‌లో మా అమ్మమ్మ పాత్ర చెప్పడం ముగించగానే, డా.కామేశ్వరి గారు కళ్ళనీళ్ళు జలజలా కార్చేసారు. ఆ స్పందన నాకు ఆశ్చర్యం కలిగించింది. అప్పుడు ఆవిడ మైకు తీసుకుని

"ఆ శ్రీహరిరావుగారితో ఆ రమణమ్మగారు అడవులలో కాలినడకన రాజమండ్రి నుండి లక్నో వెళ్ళారు.. అన్నన్ని కష్టాలు పడుతూ కూడా థ్రిల్ అనుభవించారు..... ఈ డా. ప్రకాష్‌గారి సాహచర్యంలో నా జీవితమూ అంతే!" అన్నారు.

***ఒక లక్ష్యం కోసం, ఒక ధ్యేయంతో గమ్యం చేరేవరకూ చేసే పయనం ఎంతో ప్రయాసతో కూడినదైనా థ్రిల్‌గానే ఉంటుంది. ఆ థ్రిల్లే లేకపోతే 'అన్నా' ఇలా పదిహేను రోజుల నిరాహార దీక్ష ఎనభయ్యో పడిలో చేసేవారు కాదు! 'సత్యం' అనే శక్తికున్న బలం అది!***

అన్నాహజారే దీక్ష చేస్తుంటే ఆ రామ్‌లీలా మైదానంలో ఎవరో వచ్చి మంచినీళ్ళు సీసాలు పంచారు, వేరెవరో వచ్చి ఆహారం పొట్లాలు పంచారు.. ఇవన్నీ స్వచ్ఛందంగా.. మంచి ఇంకా మిగిలేవున్నదనీ... మానవత్వం బ్రతికేవున్నదనీ తెలియచెప్పే చిహ్నాలు!

శ్రీనగర్ కాలనీలో నెలకి నలభయివేలు అద్దె వచ్చే ఆ చాట్ కౌంటర్, ఆ రెస్టారెంట్ ఓనర్ కలిదిండి ప్రసాద రాజుగారు Spreading Lightకి ఫ్రీగా ఇచ్చేసారంటే నాకు ఆశ్చర్యం వేసింది. అక్కడ చాలామంది సాహితీ మిత్రులు పరిచయం అయ్యారు. అసిఫుద్దీన్ అనే మిత్రుడు ఖురాన్ గురించి వివరించడమే కాకుండా ఇఫ్తార్ విందు కూడా ఇచ్చారు. ఆ ఇఫ్తార్ విందుకు నేను నా మిత్రుడైన డైరెక్టర్ శివనాగేశ్వరావుని పిలిచాను. అతను 'మా అబ్బాయి హలీం తినాలంటున్నాడు. ఇంటికి పార్సిల్ ఇస్తారా?' అని అడిగాడు. బొమ్మదేవర నాగకుమారి కుబానీ కా మీటా పెడితే బావుండని అంది. ఇంతలో కలిదిండి ప్రసాదరాజు గారు కలగజేసుకుని 'మీ అబ్బాయిని ఇక్కడికొచ్చి తినమనండి ఇంటికి తీసుకువెళ్ళకూడద'ని నిఖ్ఖచ్చిగా చెప్పారు. వీళ్ళ కోరికలకి నేను నవ్వుకున్నాను. అసిఫుద్దీన్ పర్షియా, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు.. ఏది మాట్లాడినా ఆయన మాతృభాషలా స్వచ్ఛంగా మాట్లాడతారు. (మన ఏంకర్స్, ఏక్టర్స్ సిగ్గుపడాలి. 'ళ' అక్షరం పలక లేనందుకు!)

చాలామంది దానం సాయం చేస్తారు. కానీ వాళ్ళని చూస్తే మనకి ఆ విషయం నమ్మబుద్ధి కాదు! మా పరాంకుశం బాబాయ్ ఓ విషయం చెప్పాడు. ఒకసారి జంధ్యాల పౌర్ణమికి ఈయన జంధ్యం కొనుక్కోడానికి వెళుతుంటే శర్మగారనే ఇంకో ఆయన కూడా తోడుగా వచ్చాడుట.

"ఎక్కడ కొంటారు?" అనే టాపిక్ వచ్చి ఆయన " అమ్మో ఇక్కడ పది రూపాయలండీ బాబూ.. ఎందుకంతా? దిల్‌సుఖ్ నగర్ డిపో వరకూ వెళితే ఐదు రూపాయిలే" అన్నాడుట. మా బాబాయ్ మనసులో సంవత్సరానికి ఒకసారి కొనే జంధ్యం గురించికూడా ఆలోచిస్తున్నాడు కదా అనుకున్నాడుట. ఆయన ఎండలో నడుచుకుంటూ పోయాడుట. పీనాసివాడు అనుకుని మా బాబాయ్ ఇంటి దగ్గర గుడిలోనే కొనుక్కుని వచ్చేసాడుట!

ఆ తరువాత మా అత్తయ్య మనవరాలు పల్లవికి, పాతికేళ్ళ పిల్లకి రెండు కిడ్నీలూ పాడయిపోయి ట్రాన్స్‌ఫ్లాంటేషన్ చేయించాల్సి వచ్చింది. డోనర్ ఎవరో కాదు వాళ్ళ పిన్ని పద్మ! అంటే మా బాబాయ్‌కి అక్క కూతురు. ఆ బాధ్యతా, ఖర్చూ మాబాబాయిదే మేమంతా తెలిసిన వాళ్ళ దగ్గర అడిగి తలో చెయ్యీ వేసాం. ఆ సమయంలో ఈ జంధ్యం పెద్దమనిషి మావిడి పండ్లు తీసుకుని వచ్చి, "దేవుడి దగ్గర పెట్టి తెచ్చాను అమ్మాయికి ఇవ్వండి" అన్నాడుట.

మా బాబాయ్ ఆశ్చర్యంగా చూస్తే అడుగున పదివేలున్నాయిట! "ఇంతే ఇవ్వగలిగినందుకు సిగ్గుగా ఉందండీ" అన్నాడుట. కానీ ఆయన్ని తప్పుగా అంచనా వేసినందుకు నిజంగా సిగ్గుపడింది మా బాబాయేట!

ఉప్పూ, కర్పూరం పక్క పక్కన పెడితే ఒకలాగే ఉంటాయి. నోట్లో వేసుకుంటే వాటి రుచులు తెలుస్తాయి అని వేమన ఎప్పుడో చెప్పాడుగా!

అందుకే.. కొంచెం పంచవయ్యా
నువ్వు అందరి బంధువయ్యా!
మంచిని పెంచవయ్యా
నువ్వు అందరి బంధువయ్యా!

●●●

Click here to share your comments on this serial

